క్లుప్తంగా

అంకాపూర్ సందర్శన



పెర్కిట్: ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామాన్ని ట్రైయినీ అసిస్టెంట్ కలెక్టర్ సంకేత్ కుమార్ మంగళవారం సందర్శించారు. జీపీలో అధికారులతో సమావేశమై వస్తున్న ఆదాయ ఖర్చుల నిర్వహణపై చర్చించారు. గ్రామ ప్రజల వృత్తులు, జీవన ప్రమాణాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం పల్లె ప్రకృతి వనాన్ని సందర్శించారు. ఆయన వెంట ఎంపీడీవో సాయిరాం, ఎంపీవో శ్రీనివాస్, ఏపీవో సురేష్, కార్యదర్శి హారిక తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ బస్సులను నడపాలి



నందిపేట్: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ విద్యార్థుల కోసం ఆర్టీసీ ప్రత్యేకంగా బస్సులు నడపాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మంద మహిపాల్ ఆర్టీసీ ప్రాంతీయ అధికారి జానీరెడ్డికి మంగళవారం వినతి పత్రం అందజేశారు. బస్సులు సరైన సమయానికి రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. దీనిపై ఆర్ఎం సానుకూలంగా స్పందించారని విద్యార్థుల కోసం ప్రత్యేక రవాణా సౌకర్యం ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.

కొనసాగుతున్న శిక్షా సప్తాహం

వేల్పూర్: మండలంలోని అన్ని పాఠశాలల్లో సోమవారం ప్రారంభమైన శిక్షా సప్తాహం మంగళవారం కొనసాగింది. ఇందులో భాగంగా విద్యార్థులచే నిపుణ్ భారత్, ఫండమెంటల్ లిటరసీ అండ్ న్యూమరసి కార్యక్రమాలు నిర్వహించారు. వేల్పూర్, పడగల్, అంక్సాపూర్, పచ్చల నడ్కుడ, మోతె, కుకునూర్, రామన్నపేట్, లక్కోర తదితర పాఠశాలల్లో శిక్షా సప్తాహం కొనసాగింది. కార్యక్రమంలో హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రూ.2.50లక్షల ఎల్ఓసీ అందజేత

డొంకేశ్వర్: అనారోగ్యంతో బాధపడుతున్న డొంకేశ్వర్ మండలం మారంపల్లికి చెందిన ఆరె చంద్రకు మెరుగైన వైద్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.2.50లక్షల ఎల్ఓసీని మంజూరు చేసింది. ఈ మేరకు ఎల్ఓసీ కాపీని కాంగ్రెస్ నాయకులు బాధిత కుటుంబానికి మంగళవారం అందజేశారు. శస్త్ర చికిత్సకు ఆర్థికసాయం అందేలా కృషి చేసిన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డికి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆరు గ్యారంటీలను అమలు చేయాలి

ఆర్మూర్‌టౌన్: ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా ఇచ్చిన ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని ఐఎఫ్‌టీయూ శ్రామిక స్పందన రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొట్ల రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సయ్యద్ మహమూద్, బి పెద్దులు, కె సంజీవ్, భాను బేగం, అరుణ, చందన, అఖిల, జయ, సంగీత తదితరులు పాల్గొన్నారు.

రెంజల్‌లో ర్యాలీ



రెంజల్: మండల కేంద్రంలో మంగళవారం అమ్మమాట–అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకు ముందు అంగన్‌వాడీ టీచర్లు, పిల్లల తల్లులతో ర్యాలీ చేపట్టారు. అనంతరం చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. మండల సూపర్‌వైజర్ ప్రమీలరాణి మాట్లాడుతూ.. ఈ నెల 26న ఆర్‌బీఎస్‌పీ ఆధ్వర్యంలో చిన్న పిల్లలకు హైదరాబాద్‌లోని అపోలో ఆస్పత్రిలో గుండె వ్యాధి నిర్ధారణ శిబిరం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

బంక్ సీజ్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

బోధన్ టౌన్: పెగడపల్లిరోడ్డులో ఉన్న ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్‌ను సీజ్ చేసిన సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ పెట్రోల్ బంక్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దినేశ్ రెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ఉమ్మడి జిల్లాల పెట్రోల్ బంక్ ప్రొపరేటర్ల సమావేశానికి హాజరై మాట్లాడారు. పెగడపల్లిలో ఉన్న పెట్రోల్ బంక్‌ను ఈ నెల 20న తనిఖీ చేసిన ఇద్దరు అధికారులు ఆన్‌లైన్‌లో డెన్సిటీ రికార్డ్ చేసినా, మ్యాన్వల్‌గా ఎందుకు చేయలేదని చూపుతూ బంక్‌ను సీజ్ చేశారన్నారు. ఉన్నతాధికారులు స్పందించి బంక్‌పై నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతాప్ గుప్త, శశి భూషణ్, వెంకట రమణ, ఇయా ఖాన్, సలీమ్, విష్ణు, రాకేశ్, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు అపరిశుభ్రం

- గ్రామాల్లో పేరుకుపోతున్న చెత్తాచెదారం
- ఇబ్బందుల్లో ప్రజలు
- పట్టించుకోని అధికారులు



నందిపేటలో రోడ్డు పక్క పేరుకుపోయిన చెత్తాచెదారం



శాపూర్‌లో ఇళ్ల మధ్య నిలిచిన మురికినీరు

నందిపేట్: ఖాళీ స్థలాల్లో ముళ్ల పొదలు పెరిగి, గుంతల్లో మురికి నీరు నిల్వ ఉండడంతో పాటు ఎక్కడపడితే అక్కడ చెత్తాచెదారం పేరుకుపోవడంతో గ్రామాలు మురికివాడలను తలపిస్తున్నాయి. నిధుల లేమిని సాకుగా చూపి గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై అధికారులు దృష్టి సారించడం లేదు. దీంతో నివాసాల మధ్య ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు పొదలు ఏపుగా పెరిగి విషసర్పాలకు నిలయాలుగా మారుతున్నాయి. మురుగు నీరు చెత్తాచెదారంతో దోమలు విజృంభించి గ్రామ ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. గ్రామాలను శుభ్రంగా ఉంచాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం ప్రతి జీపీకి ట్రాక్టరును కొనుగోలు చేసి ఇచ్చింది. కానీ అవి ప్రస్తుతం అలంకారప్రాయంగా మారాయి. గతంలో నిత్యం ట్రాక్టర్ల ద్వారా చెత్త సేకరణ జరిగేది. ప్రస్తుతం పదిహేను రోజులకు ఒకసారి చెత్త సేకరణ జరుగుతుందని గ్రామీణులు వాపోతున్నారు. ఆరు నెలల నుంచి వేతనాలు అందకపోవడంతో చాలా గ్రామాల్లో పారిశుధ్య కార్మికులు విధులకు రావడం లేదు. దీంతో మురుగు కాలువల్లో చెత్త పేరుకుపోయి వర్షపు నీటితో కలిసి మురుగు నీరు అంతర్గత రహదారులపై ప్రవహిస్తోంది. దోమలు విజృంభిస్తున్నా కాలనీల్లో ఫాగింగ్ చేయడం లేదని స్థానికులు వాపోతున్నారు. పంచాయతీ కార్యదర్శులు కార్యాలయాలకే పరిమితం అవుతున్నారని అధికారులు సమీక్ష సమావేశాలు నిర్వహించడం తప్ప సమస్యల గురించి పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారులు, నివాసాల పక్కనే పేడ కుప్పలు వేస్తున్నా వాటిని తొలగించకపోవడంతో వర్షపు నీరు తోడవడంతో దోమలు, ఈగల ఆవాసానికి నిలయంగా మారుతున్నాయి.

సమస్యలపై దృష్టి సారిస్తాం

జీపీలకు నిధుల కొరత ఉంది. దీంతో కొంతమేర ఇబ్బంది కలుగుతుంది. సాధ్యమైనంత వరకు గ్రామీణులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నాం. దోమల నివారణకు పిచికారీ చేయాలని కార్యదర్శులను ఆదేశించాం. దశలవారిగా గ్రామాల్లోని సమస్యలను తొలగిస్తాం

– శ్రీనివాసరావు, ఎంపీడీవో, నందిపేట

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



ముప్కాల్‌లో శివరాజ్‌ను సన్మానిస్తున్న నాయకులు

బాల్కొండ: స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు గెలుపే లక్ష్యంగా పనిచేయాలని బీజేపీ జిల్లా సీనియర్ నాయకుడు పుప్పాల శివరాజ్ అన్నారు. ముప్కాల్ మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన పార్టీ నాయకుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పార్టీ బలోపేతానికి అందరూ సమష్టిగా కృషి చేయాలన్నారు. అనంతరం శివరాజ్‌ను పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు నిమ్మల శ్రీనివాస్, ముస్కు నర్సయ్య, గడ్డం సంతోష్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎడపల్లిలో భరతమాత చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు

ఎడపల్లిలో..

ఎడపల్లి: స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు బీజేపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని బోధన్ నియోజకవర్గ నాయకుడు వడ్డీ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పార్టీ మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. భరతమాత చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కేపీరెడ్డి, కోలా ఇంద్రకరణ్, చిక్కెలా సృజన్, గెంటె శ్రీనివాస్, చిలుక ప్రవీణ్, చైతన్య, బూత్‌స్థాయి అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలో పోలీస్ కళాజాత



రుద్రూర్: కోటగిరి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మూఢ నమ్మకాలు, సైబర్ నేరాలపై కలిగే అనర్థాల గూర్చి కళా బృందం ప్రదర్శనల ద్వారా మంగళవారం అవగాహన కల్పించారు. నాటికలు, పాటల ద్వారా కళా బృందం సభ్యులు ఇచ్చిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. యువత గంజాయి, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సూచించారు. షీటీమ్, సీఈఐఆర్ పోర్టల్, సీసీ కెమెరాల ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో ఎస్సై సందీప్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల్లో బోనాల పండుగ



బొప్పాపూర్‌లో బోనాలను ఊరేగిస్తున్న గ్రామస్తులు



రాణంపల్లిలో..

రుద్రూర్/ పొతంగల్/ బోధన్‌రూరల్/ బోధన్ టౌన్/ నవీపేట: రుద్రూర్ మండలంలోని బొప్పాపూర్, రాణంపల్లిలో గ్రామ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. బోనాలను గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగించి గ్రామదేవతలకు సమర్పించారు. ఆలయాల్లో పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. పొతంగల్ మండలం హంగర్గాలో, బోధన్ మండలంలోని కల్దుర్కిలో, బోధన్ పట్టణంలోని మహారాణా ప్రతాప్ క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో, నవీపేట మండల కేంద్రంలోని ఆరె కటికె సంఘం ఆధ్వర్యంలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. బోనాలను ఊరేగించి గ్రామ దేవతలకు సమర్పించారు.



నవీపేటలో బోనాలను ఊరేగిస్తున్న భక్తులు



హంగర్గాలో..



బోధన్ మండలం కల్దుర్కిలో..



బోధన్‌లో ఊరేగింపు నిర్వహిస్తున్న మహిళలు

28న బోనాల పండుగ



సమావేశంలో మాట్లాడుతున్న గ్రామ పెద్దలు, కుల సంఘాల సభ్యులు

రుద్రూర్: మండల కేంద్రంలో ఈ నెల 28న బోనాల పండుగను నిర్వహించనున్నట్లు వివిధ కులసంఘాల సభ్యులు, గ్రామ పెద్దలు తీర్మానించారు. మంగళవారం గ్రామ వతన్‌దార్ వెంకటేశ్వర దేశాయ్ ఆధ్వర్యంలో గ్రామస్తులు సమావేశమయ్యారు. ప్రతి ఏడాది లాగే ఈ ఏడాది కూడా బోనాల పండుగను ఘనంగా నిర్వహించాలని, ఇందుకు కుల సంఘాలు, గ్రామస్తులు సహకరించాలని తీర్మానించారు. గ్రామ పెద్దలు, కుల సంఘాల బాధ్యులు, నాయకులు పాల్గొన్నారు.

త్వరలో విచారణకు ఆదేశాలు

సాక్షి ఎఫెక్ట్..

నిజామాబాద్‌నాగారం: సాక్షిలో ప్రచురితమైన విద్యుత్‌శాఖ అధికారులు విచిత్ర ధోరణి అనే కథనంపై జిల్లా, ఉన్నతాధికారులు స్పందించారు. అసలేం జరిగిందనే అనే కోణంలో విచారణ చేయడానికి త్వరలో ఆదేశాలు రానున్నట్లు ఎస్ఈ రవీందర్ మంగళవారం తెలిపారు. ఆర్మూర్ డివిజన్‌లోని గుగ్లత్ మదన్‌లాల్ అనే (సబ్‌స్టేషన్ ఆపరేటర్)ఆర్టిజన్ గతంలో ఫేక్ సర్టిఫికేట్‌తో ఉద్యోగంలో చేరాడు. ఈ విషయం తెలిసిన డీఈ పోలీస్‌స్టేషన్‌లో మదన్‌లాల్‌పై ఎఫ్ఐఆర్ బుక్ చేయాల్సి ఉంటుంది. కానీ 9నెలలు కాలయాపన చేయడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈవిషయంలో ఉద్యోగుల పాత్ర, అధికారుల పాత్ర ఎంత ఉందో తెలియాల్సి ఉంది. క్షుణ్ణంగా పరిశీలన చేస్తేనే అసలు నిజానిజాలు బయటకు వచ్చే అవకాశం ఉంది.

సమగ్ర విచారణ చేయిస్తాం

ఆర్మూర్ డివిజన్‌లో జరిగిన ఘటనకు సంబంధించి గత ఏడాది ఏప్రిల్‌లో ఆర్టిజన్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయాల్సి ఉండేది. డీఈ ఎందుకు ఎఫ్ఐఆర్ చేయలేదో తెలియదు. డీఈ ఇచ్చిన ఆధారంగానే జేఏవో, ఎల్‌డీసీకి రికవరీ కోసం లేఖలు పంపించాం. దీనిపై ఎవరి ప్రమేయం ఎంత వరకు ఉందో తెలియడానికి ఉన్నతాధికారుల అనుమతితో సమగ్రంగా విచాణ చేయిస్తాం.

– రవీందర్, విద్యుత్‌శాఖ ఎస్ఈ

సమాచారం..

■ దరఖాస్తుల ఆహ్వానం

వేల్పూర్/ భీమ్‌గల్: వేల్పూర్ మండలంలో రైతు బీమాలో మార్పులు చేసుకునేవారు ఈ నెల 30 లోగా మండల వ్యవసాయ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఏవో నర్సయ్య మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతు బీమాలో ఆధార్‌లో మార్పులు లేదా నామినీ పేరు మార్పిడి, నామిని చనిపోతే కొత్త నామిని నమోదు చేయడం కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. భీమ్‌గల్ మండలంలోని అన్ని గ్రామాల అర్హులైన రైతులు రైతు బీమా కోసం ఆగస్టు 5లోగా దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సాయికృష్ణ పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునే రైతులు తమ పట్టాపాస్‌బుక్, ఆధార్ కార్డు, నామిని ఆధార్ కార్డు జిరాక్స్‌లతో ఏఈవోను సంప్రదించాలన్నారు.

■ కేజీబీవీలో హెడ్‌కుక్ కోసం..

రెంజల్: రెంజల్‌లోని కేజీబీవీలో హెడ్‌కుక్ పోస్టుకు అర్హులైన మహిళలు దరఖాస్తు చేసుకునాలని ఎంఈవో గణేశ్‌రావు పేర్కొన్నారు. పదో తరగతి పాసై ఉండాలని, జూలై ఒకటి 2024 నాటికి 18 నుంచి 45 ఏళ్ల వయస్సు కలిగి ఉన్న దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 27లోగా కేజీబీవీలో దరఖాస్తులను అందించాలని సూచించారు.


■ టీజీ మోడల్ స్కూల్‌లో..

నవీపేట: మండల కేంద్రంలోని టీజీ మోడల్ స్కూల్‌లోని బాలికల వసతి గృహంలో వంట మనిషి కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో గణేశ్‌రావు పేర్కొన్నారు. పదో తరగతి పాసై 18 నుంచి 45 ఏళ్ల లోపు ఉన్న వారు అర్హులన్నారు. ఈనెల 27లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

■ నేడు ఇసుక వేలం

రుద్రూర్: పొతంగల్ శివారులో సీజ్ చేసిన ఇసుకను బుధవారం వేలం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ మల్లయ్య మంగళవారం పేర్కొన్నారు. పొతంగల్ బైపాస్ రోడ్డు సమీపంలో ఉన్న శ్రీ వీరభద్ర స్వామి ఆలయం వద్ద ఉన్న 12 ట్రాక్టర్ల ఇసుకను వేలం వేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.

డీసీసీబీ మాజీ చైర్మన్ జన్మదిన వేడుకలు



పొతంగల్‌లో కేక్ కట్ చేస్తున్న నాయకులు

రుద్రూర్/ వర్ని: డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ నాయకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. కోటగిరి, పొతంగల్, రుద్రూర్, వర్ని, చందూర్, మోస్రా మండల కేంద్రాల్లో పార్టీ నాయకులు ప్రధాన చౌరస్తా, పార్టీ కార్యాలయాల వద్ద కేక్ కట్ చేసి అందరికి పంచిపెట్టారు. పలు చోట్ల అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.

అధికారుల బదిలీ

బోధన్‌టౌన్/ రెంజల్: బోధన్ బల్దియాలో 11 మంది అధికారులు బదిలీ అయ్యారు. మేనేజర్ నరేందర్‌తో పాటు శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ శంకర్, ముగ్గురు సీనియర్ అసిస్టెంట్స్, జూనియర్ అసిస్టెంట్స్ తో పాటు మరో ఇద్దరు బిల్ కలెక్టర్లు బదిలీపై వెళ్లినట్లు తెలిసింది. రెంజల్ మండల ఎంపీవో గౌస్ మొయినొద్దీన్ ముప్కాల్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో మోస్రా నుంచి రఫీయొద్దీన్ వచ్చారు. మంగళవారం ఆయన బాధ్యతలు చేపట్టారు.

ప్లాంటేషన్ త్వరగా పూర్తి చేయాలి



కమ్మర్‌పల్లి: వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నందున గ్రామాల్లో ప్లాంటేషన్ పనులు ప్రారంభించి లక్ష్యాన్ని త్వరగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ అంకిత్ తివారి పేర్కొన్నారు. మంగళవారం మండలంలో పర్యటించి పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఎంపీడీవో కార్యాలయంలోని ప్రజాపాలన సేవా కేంద్రాన్ని సందర్శించి పలు సూచనలు చేశారు. అనంతరం వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. కేజీబీవీని సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. పల్లె ప్రకృతి వనాన్ని సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపీడీవో రాజశ్రీనివాస్, తహసీల్దార్ ఆంజనేయులు, జీపీ కార్యదర్శి శాంతికుమార్, ఈజీఎస్ ఏపీవో విద్యానంద్ తదితరులు ఉన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



ఆర్మూర్‌లో మొక్కలు నాటుతున్న ఏసీపీ బస్వారెడ్డి

ఆర్మూర్‌టౌన్: పర్యావరణ పరిరక్షణకు విద్యార్థులు తమవంతుగా మొక్కలు నాటి సంరక్షించాలని ఏసీపీ బస్వారెడ్డి సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో మంగళవారం నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ జస్టిస్ మూమెంట్ ఆధ్వర్యంలో వన మహోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య శ్రీనివాస్, కమిషనర్ రాజు, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ మున్ను, రూరల్ సీఐ శ్రీధర్, ట్రాఫిక్ సీఐ రమేశ్, నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ జస్టిస్ మూమెంట్ జిల్లా అధ్యక్షుడు హనీఫ్, ఉపాధ్యక్షుడు తమ్మె వినోద్, సురేష్, కూనె జితేందర్, నిశాంత్ కుమార్, అధ్యాపకులు దేవారాం, వెంకటేశ్ పాల్గొన్నారు.

బాచన్‌పల్లిలో..

భీమ్‌గల్: నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని ఎంపీడీవో సంతోష్ కుమార్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. వనమహోత్సవంలో భాగంగా మండలంలోని పల్లికొండ, బాచన్‌పల్లి గ్రామాలను ఎంపీడీవో మంగళవారం సందర్శించారు. మొక్కల పెంపకం గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీవో నర్సయ, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ఉన్నారు.



డొంకేశ్వర్‌లో అధికారులు, గౌడ సంఘం సభ్యులు

ఈత మొక్కలు నాటిన ఎక్సైజ్ అధికారులు

డొంకేశ్వర్: డొంకేశ్వర్ మండల కేంద్రంలో ఎక్సైజ్ అధికారులు గౌడ కులస్తులతో కలిసి మొక్కలు నాటారు. కల్లుగీత కార్మికులకు ఉపాధి అవకాశాలు పెంచడానికి రాష్ట్ర ప్రభుత్వం ఈత వనాలను పెంచుతోందని ఎక్సైజ్ అధికారి దిలీప్ తెలిపారు. కార్యక్రమంలో గౌడసంఘ సభ్యులు భూమాగౌడ్, రామాగౌడ్, గంగాగౌడ్, సతీశ్‌గౌడ్, గణేశ్‌గౌడ్, సుధాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ముంపు గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయించాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న నాయకులు

డొంకేశ్వర్: ఎస్సారెస్పీలో ముంపునకు గురై పునరావాసం ఏర్పాటు చేసుకున్న గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని తొండాకూర్‌లో మంగళవారం నిర్వహించిన బీజేపీ మండల కార్యవర్గ సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. కార్యక్రమానికి పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతన్‌కర్ లక్ష్మీనారాయణ, మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ కైసర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పార్టీ జెండా ఆవిష్కరణ, జ్యోతి ప్రజ్వలనతో కార్యవర్గ సమావేశాన్ని ప్రారంభించారు. ముంపు గ్రామాల్లోని పేద ప్రజలకు ఇళ్ల నిర్మాణాలు, మత్స్యకార్మికులకు సబ్సిడీపై వాహనాలు, యువతకు నాబార్డు ద్వారా రుణాలు, పాడి గేదెలకు ప్రోత్సాహం అందించాలని తీర్మానం చేశారు. మండల అధ్యక్షుడు పోతుగంటి సురేందర్, మాజీ ఎంపీటీసీ సంజీవ్, నాయకులు సాగర్, రంజిత్, మురళి, గంగాధర్ పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు సన్మానం



ఆర్మూర్‌లో బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను సన్మానించిన హెచ్ఎం, తోటి ఉపాధ్యాయులు



ఖాజాపూర్‌లో సన్మానం పొందిన ఉపాధ్యాయులు

బోధన్: సాలూర మండలంలోని ఖాజాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు నిజాముద్దీన్, గంగాధర్, సుమలతను గ్రామ పెద్దలు, యువజన కాంగ్రెస్ నాయకులు పాఠశాల ప్రాంగణంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శోభ, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిద్రపు అశోక్, సొసైటీ మాజీ చైర్మన్ మారుతిరావు పటేల్, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ సోన్‌కాంబ్లే సాయిలు, గ్రామ పెద్దలు రమేశ్, చిద్రపు లక్ష్మణ్, శ్యాం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌లో..

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు, సిబ్బందిని హెచ్ఎం లక్ష్మీనర్సయ్య మంగళవారం సన్మానించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	ట్విస్టర్ (హిందీ) – 11.50, 6.40, 9.30 భారతీయుడు-2 (తెలుగు) – 02.45
స్క్రీన్-2 –	కల్కి – 2898 ఏడి (3డీ-తెలుగు) – 11.00, 2.45, 6.30, 10.15
స్క్రీన్-3 –	డార్లింగ్ (తెలుగు) – 11.45, 3.05, 6.25, 9.45
స్క్రీన్-4 –	ది బర్త్‌డే బాయ్ (తెలుగు) – 02.20, క్రైమ్ రీల్ (తెలుగు) – 5.00 పేకమేడలు (తెలుగు) – 7.35 భారతీయుడు-2 (తెలుగు) – 10.15

నేడు మున్సిపల్ కమిషనర్‌తో సాక్షి ఫోన్ ఇన్

వానాకాలంలో డెంగీ, మలేరియా తదితర వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున భీమ్‌గల్ మున్సిపల్ కమిషనర్ రామకృష్ణతో 'సాక్షి' ఫోన్‌ఇన్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహిస్తోంది. మున్సిపల్ పరిధిలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పారిశుధ్య చర్యలపై ప్రజలు ఫోన్ చేసి మాట్లాడవచ్చు.

తేది : 24-07-2024 (బుధవారం)
సమయం: మధ్యాహ్నం 12:00 నుంచి 1:00 గంటల వరకు.



రామకృష్ణ, మున్సిపల్ కమిషనర్, భీమ్‌గల్

ఫోన్ చేయాల్సిన నంబర్ : 63037 55698